





ఇందిర ప్రియదర్శిని కాలనీ ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు హాజరైన విద్యార్థులు

● నిలిచిన వర్షపు నీటిలోనే బోర్గాం పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు

తొలిరోజు అంతంతే..

ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులు..

వేసవి సెలవుల అనంతరం విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వచ్చారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తొలి రోజు సందడి వాతావరణం నెలకొంది. మొదటి సారి పాఠశాలలకు వచ్చే చిన్నారులు తమ తల్లిదండ్రుల వెంట రాగా బుడి బుడి నడకలతో పాఠశాలకు వచ్చారు. కొంత మంది మారం చేస్తూ ఏడుస్తూ పాఠశాలలకు రావడం కనిపించింది. మొదటి సారి పాఠశాలలకు వెళ్తున్నామన్న సంతోషం చిన్నారుల్లో కనిపించింది.



బోర్గాం పాఠశాలకు హాజరైన విద్యార్థులు



- పునఃప్రారంభమైన ప్రభుత్వ పాఠశాలలు
- మొదటిరోజు నామమాత్రంగా విద్యార్థుల హాజరు
- వర్షాలతో చిత్తడిగా మారిన పాఠశాల ప్రాంగణాలు
- సమస్యలతో స్వాగతం పలికిన ప్రభుత్వ స్కూళ్లు

● మిర్చీ కంపౌండ్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల ఇలా..



నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పాఠశాలలు గురువారం పునఃప్రారంభమయ్యాయి. వేసవి సెలవుల అనంతరం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకున్నాయి. అయితే వర్షాల కారణంగా తొలిరోజు విద్యార్థుల హాజరు శాతం అంతంతమాత్రంగానే ఉంది. విద్యార్థులు పై తరగతులకు వెళ్తున్నామని కొత్త ఉత్సాహంతో పాఠశాలలకు వచ్చిన విద్యార్థులకు ఇక్కట్లు తప్పలేదు. కురుస్తున్న వర్షాలతో పలు పాఠశాలల ప్రాంగణాల్లో నీరు నిలిచి చెరువులను తలపించాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

సమస్యలతో స్వాగతం..

పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలికాయి. వర్షం కురవడంతో చాలా పాఠశాలల ప్రాంగణాలు చిత్తడిగా మారాయి. అన్ని పాఠశాలల్లో ఉన్న గ్రౌండ్లు వర్షం నీటితో నిండిపోయాయి. కొన్ని పాఠశాలల ముందు ఉన్న ప్రాంగణాలు వర్షం నీటితో నిండిపోవడంతో విద్యార్థులు నీళ్లలోనే నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి కనిపించింది. మరుగుదొడ్లు, మూత్రశాలలు సరిగా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

గోదాంలో కొనసాగుతున్న ప్రాథమిక పాఠశాల

జిల్లా కేంద్రంలోని మిర్చీ కంపౌండ్ ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సరైన తరగతి గదులు లేక మార్కెట్ కమిటీకి సంబంధించిన గోదాంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. గత విద్యా సంవత్సరం మొత్తం 30 మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకోగా గురువారం కేవలం 6 గురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. మార్కెట్ కమిటీ గోదాములో నాకాష్‌గల్లి జీయూపీఎస్ తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలతో పాటు మిర్చీ కంపౌండ్ ఉర్దూ మీడియం పాఠశాలను కొనసాగిస్తున్నారు. ఈ మార్కెట్ కమిటీ గోదాము పూర్తిగా శిథిలావస్థలో ఉండగా సరైన వసతులు కూడా లేవు. పైకప్పు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి మధ్య విద్యార్థులు బిక్కు బిక్కు మంటూ చదువుకునే పరిస్థితి ఉంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోనే ఈ పరిస్థితి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో మరింత దారుణ పరిస్థితులు ఉన్నాయి. నగరంలోని ఇందిర ప్రియదర్శిని కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులకు 10 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. గౌతంనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇద్దరు రెగ్యులర్ ఉపాధ్యాయులు ఉండగా 6 గురు విద్యార్థులు మాత్రమే హాజరయ్యారు. ఒక ఉపాధ్యాయురాలు ఈ పాఠశాలలో డిప్యూటేషన్‌పై పని చేస్తుంది. పాఠశాలలో మొత్తం 30 మంది విద్యార్థులు ఉన్నట్లు చెబుతున్నప్పటికీ తొలి రోజు మాత్రం 6 గురు మాత్రమే పాఠశాలకు వచ్చారు. మిర్చీ కంపౌండ్‌లోగల నాకాష్‌గల్లి జీయూపీఎస్ పాఠ శాలలో తొలిరోజు ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరుకాగా మొత్తం 6 గురు టీచర్లు అక్కడ పనిచేస్తున్నారు.

పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ల పంపిణీ..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ జక్రాన్‌పల్లి మండలం జడ్పీహెచ్ఎస్ లక్ష్మాపూర్ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. అదేవిధంగా జక్రాన్‌పల్లి కేజీబీవీ విద్యార్థులకు యూనిఫామ్‌లను, పుస్తకాలను పంపిణీ చేసి అక్కడి పరిస్థితులను గమనించారు.



జక్రాన్‌పల్లిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేస్తున్న డీఈవో

● వినాయకనగర్ హనుమాన్ జంక్షన్ వద్ద వరద ఇలా..



జిల్లాలో భారీ వర్షం

- నీట మునిగిన లోతట్టు కాలనీలు
- ఎస్సారెస్పీలోకి స్వల్పంగా మొదలైన వరద

నిజామాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. జిల్లాలో ఉదయం కొన్ని మండలాల పరిధిలో ఓ మోస్తరు పడగా మరికొన్ని మండలాల పరిధిలో భారీగా పడింది. జిల్లాలో ఒకేసారి పడిన వర్షం కొద్దిసేపు జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. జిల్లాలో పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు ఈ వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడటంతో పలు ప్రాంతాల్లో నీళ్లు నిలిచాయి. నిజామాబాద్ నగరం, ఆర్మూర్, బోధన్, భీంగల్ మున్సిపాలిటీలతో పాటు ఇతర ప్రాంతాల్లో వర్షాలు పడటంతో లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు చేరాయి. డ్రైనేజీలు క్లియర్ చేయకపోవడం వల్ల రోడ్లపై వరద పారింది.

అత్యధికంగా మోర్తాడ్‌లో

జిల్లాలో అత్యధికంగా మోర్తాడ్ మండలంలో 39.7, భీంగల్ 36.3, కమ్మర్‌పల్లి 36.3, ముప్కాల్ 29.9, వేల్పూర్ 28.9 మిల్లీమీటర్ల వర్షం పడింది. జిల్లాలో సరాసరి 10 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో 33 మండలాలు ఉండగా 29 మండలాల్లో సరాసరి సగటు వర్షపాతంకు మించి వర్షం పడింది. నాలుగు మండలాల్లో సరాసరి సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాలో ఈ వర్షాకాలంలో 1018 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా




జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 59.9 మిల్లీమీటర్ల వర్షం నమోదైంది.

ఎస్సారెస్పీకి స్వల్ప ఇన్‌ఫ్లో

జిల్లాలో కొన్ని రోజులుగా వర్షం పడుతుండటంతో ఎస్సారెస్పీకి స్వల్పంగా వరద మొదలైంది. ప్రాజెక్టులోకి ప్రస్తుతం 2018 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1062.80 అడుగుల నీళ్లు ఉన్నాయి. ప్రాజెక్టులో 80.5 టీఎంసీలకు గాను ప్రస్తుతం 13.369 టీఎంసీల నీళ్లు ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడుతుండటంతో రైతులు పంటల సాగును కూడా కొనసాగిస్తున్నారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఆరుతడి పంటలను వేస్తున్నారు. బోధన్ డివిజన్ పరిధిలో వరిసాగును చేస్తున్నారు. మరో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉన్నందున రైతులతో పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.

● నగరంలో నీటమునిగిన లోతట్టు ప్రాంతం



ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్క

● ఆదిలాబాద్‌కు జూపల్లి

నిజామాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా సీతక్కను నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఇప్పటి వరకు ఉన్న ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జిగా నియమించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ఈ మార్పులను ప్రభుత్వం చేసింది. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎక్కువ శాతం సీట్లను సాధించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి జిల్లా పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. పథకాల అమలు మరింత వేగవంతం కావడంతో పాటు వందశాతం అమలు చేసే విధంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర క్యాబినెట్‌లో ఎవరూ లేకపోవడం వల్ల పూర్తిస్థాయిలో సమయం కేటాయించేందుకు సీతక్కను జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమించినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు.

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు బదిలీ

● నూతన కలెక్టర్‌గా టి. వినయ్ కృష్ణారెడ్డి నియామకం

నిజామాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన స్థానంలో టి. వినయ్ కృష్ణారెడ్డిని నియమించింది. ఆయన ప్రస్తుతం ఆర్ అండ్ ఆర్, ఎల్‌పి కమిషనర్ పనిచేస్తున్నారు. జిల్లాలో కలెక్టర్‌గా పనిచేసి బదిలీ అయిన రాజీవ్‌గాంధీ హన్మంతును రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమించింది. దీంతోపాటు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీగా, భూ భారతి పీడీగా కూడా అదనపు బాధ్యతలను అప్పజెప్పింది. కాగా, జిల్లాకు నూతన కలెక్టర్‌గా నియమితులైన టి. వినయ్ కృష్ణారెడ్డి 2013 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి. గ్రూప్ 1 ద్వారా ఎంపికైన ఆయన పలు జిల్లాల్లో ఆర్డీవోగా పనిచేశారు. ఐఏఎస్‌గా ఎంపికైన తర్వాత సూర్యాపేట, మెడ్చల్ జిల్లాల కలెక్టర్‌గా పనిచేశారు. జిల్లా నుంచి బదిలీ అవుతున్న రాజీవ్‌గాంధీ హన్మంతు 2023 ఫిబ్రవరి 3 లో కలెక్టర్‌గా జిల్లాకు వచ్చారు. రెండేళ్ల 5నెలల పాటు పనిచేసిన కలెక్టర్ పలు పథకాలను పకడ్బందీగా అమలయ్యే విధంగా చూశారు. అసెంబ్లీతోపాటు పార్లమెంట్ ఎలక్షన్‌లు ప్రశాంతంగా జరిగే విధంగా చూశారు. జిల్లా పరిధిలో ధాన్యం సేకరణ, కొత్త పథకాల అమలులో ముందున్నారు. 2012 బ్యాచ్‌కు చెందిన ఆయన నాలుగు జిల్లాల పరిధిలో కలెక్టర్‌గా చేయడంతో సెక్రెటరియట్‌లో ఆయనకు కీలకమైన బాధ్యతలను అప్పజెప్పారు.



కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి

పాఠశాలల బస్సుల తనిఖీ

● బస్సులను తనిఖీ చేసిన డీటీవో

మోపాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు పునఃప్రారంభంకావడంతో స్కూల్ బస్సులను ఇన్‌చార్జి డీటీవో రాహుల్ కుమార్ తనిఖీ చేశారు. గురువారం వినాయక్‌నగర్‌లో స్కూల్ బస్సులను ఆపి ఫిట్‌నెస్‌ను పరిశీలించారు. ఒకేరోజు 50 స్కూల్ బస్సులను తనిఖీ చేయగా ఇందులో ఒక బస్సుకు ఫిట్‌నెస్ లేకపోవడంతో సీజ్ చేసినట్లు రాహుల్‌కుమార్ తెలిపారు. స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ లేనట్లయితే వాటిని సీజ్ చేస్తామని అన్నారు. ప్రతీరోజు బస్సుల తనిఖీలు కొనసాగుతాయని ఆయన తెలిపారు.

సిరికొండ: మండల కేంద్రంలో ప్రైవేటు పాఠశాలల బస్సులతోపాటు ఆటోలు, ఇతర వాహనాలను గురువారం ట్రాన్స్‌పోర్ట్ ఎస్సై శ్రీకాంత్ తనిఖీ చేశారు. పాఠశాలల బస్సులను ఫిట్‌నెస్‌తోపాటు ఆటోలు, గూడ్స్ వాహనాల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వాహనాల డ్రైవర్లకు పలు సూచనలు చేశారు.



బస్సు ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి డీటీవో రాహుల్‌కుమార్

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ



మోపాల్ సదస్సును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

- జిల్లాలో రెవెన్యూ సదస్సులకు భారీగా వస్తున్న దరఖాస్తులు
- భూ సమస్యలపై అధికారులకు రైతుల ఫిర్యాదు
- ఇప్పటి వరకు 17,160 దరఖాస్తుల స్వీకరణ

నిజామాబాద్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో చేపడుతున్న రెవెన్యూ సదస్సులకు దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు భారీగా దరఖాస్తులను చేస్తున్నారు. గ్రామాల్లో నిర్వహించే రెవెన్యూ సదస్సులకు రైతులు తరలివస్తున్నారు. తమకు సంబంధించిన భూసమస్యలను పరిష్కరించాలని ఫిర్యాదులు చేస్తున్నారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాకుండా ఉన్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు. భూమి విస్తీర్ణం, పట్టాదారు పాస్‌బుక్‌లో పేర్ల మార్పు, నిషేధిత జాబితాలో ఉన్న భూములు, అసైన్డ్ భూములు, సాదాబైనామాల కోసం ఎక్కువ మంది రైతులు దరఖాస్తులు చేస్తున్నారు. తమకు సంబంధించిన భూసమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరించాలని కోరుతున్నారు. జిల్లాలో ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులకు రైతులు వచ్చి ఈ ఫిర్యాదులను చేస్తుండటంతో అన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రైతులకు రసీదులు ఇవ్వడంతో పాటు నిర్ణీత సమయంలో భూసమస్యలు పరిష్కరిస్తామని తహసీల్దార్లు హామీలు ఇస్తున్నారు. ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు జరుగనుండటంతో ఇంకా ఎక్కువగా దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈనెల 3న నుంచి కొనసాగుతున్న సదస్సులు

భూభారతి చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత గత నెలలో పైలెట్ ప్రాజెక్టు కింద మెండోరా మండలంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. భూమికి సంబంధించిన సమస్యలను ఆ మండలం పరిధిలోని గ్రామాల రైతుల నుంచి 706 ఫిర్యాదులను స్వీకరించారు. ఇప్పటికే సగం వరకు పరిష్కరించారు. జిల్లాలో ఈనెల 3న రెవెన్యూ సదస్సులు అన్ని మండలాల పరిధిలో ప్రారంభించారు. ఈ సదస్సుల కోసం తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లతో 50 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతీరోజు ఆయా మండలాల పరిధిలో 1 నుంచి 2 గ్రామాలలో రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారు. భూసమస్యలపై రైతుల నుంచి ఈ దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. జిల్లాలో మొత్తం 445 రెవెన్యూ గ్రామాల్లో ఇప్పటి వరకు 321 గ్రామాల్లో సదస్సులను నిర్వహించారు. ఈ గ్రామాల పరిధిలో రైతుల నుంచి 17,160 దరఖాస్తులను స్వీకరించారు. రెవెన్యూ సదస్సులు పూర్తి కాగానే దరఖాస్తుల ఆధారంగా రైతులకు నోటీసులు ఇచ్చి భూములను పరిశీలించి సరిచేయనున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో మిస్సింగ్ సర్వే నెంబర్ కోసం 2775 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. తమ భూములకు సంబంధించి మిస్సింగ్ సర్వే నెంబర్‌ను సరిచేయాలని కోరారు. మ్యుటేషన్ కోసం 485 మంది, డీఎస్ పెండింగ్ కోసం 889 మంది దరఖాస్తులను చేశారు. తమ భూముల విస్తీర్ణం సరిచేయాలని రెవెన్యూ సదస్సులో

మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు మెరుగైన విద్య



విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న డీఈవో అశోక్

జక్రాన్‌పల్లి, జూన్12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెరుగైన విద్య అందుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు.బడిబాట కార్యక్రమంలో భాగంగాగురువారం మండలంలోని లక్ష్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్త కాలు, నోట్‌బుక్స్, స్కూల్ యూనిఫామ్‌లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అందజేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఐడీసీ ఎంఎస్ చైర్మన్ సాయిరెడ్డి, ఎంఈవో శ్రీనివాస్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, లింగన్న, మాజీ సర్పంచ్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ నవీపేట మండల కార్యవర్గం ఎన్నిక

నవీపేట,జూన్12(ఆంధ్రజ్యోతి): మండల బీజేపీ కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలోని తడగామలో జరిగిన మండల కమిటీ సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షులు సరిన్, మండల ఇన్‌చార్జి సుధాకర్ చారిల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా కోరే గంగాధర్, అజయ్, శ్రీనివాస్, వెంకటేష్, ప్రధాన కార్యదర్శులుగా మంత్రి రాజేందర్ గౌడ్, నీరడి భూషణ్‌తో పాటు 46మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వంశీమోహన్, శ్రీనివాస్ గౌడ్, నాగభూషణ్, ఆనంద్, శ్రీకాంత్, రాజశేఖర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులకు నియామక పత్రాన్ని అందజేశారు.

డిగ్రీ 2వ సెమిస్టర్ ఫలితాల విడుదల

బోధన్‌రూరల్,జూన్12(ఆంధ్రజ్యోతి): బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అటనమాస్ 2వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను బుధ వారం తెలంగాణ యూనివర్సిటీ సీవోఈ ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్, ఎస్ఈవోఈ డాక్టర్ శాంతబాయి ఆధ్వర్యంలో బోధన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. సురేష్, సీవోఈ డాక్టర్ కే.రాజు, ఏసీఈవో డాక్టర్ ఏ.బాబురావులు రెండవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. సెకండ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ఆన్ వెబ్ లింక్ ద్వారా ఫస్ట్ సెమిస్టర్ బ్యాగ్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఆన్ వెబ్ లింక్ ద్వారా సందర్శించాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్ వివరించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి



టాక్లీలో దరఖాస్తులు స్వీకరిస్తున్న తహసీల్దార్



వేల్పూర్ రెవెన్యూ సదస్సులో ..

కోటగిరి,జూన్12(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సుల్లో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తహసీల్దార్ గంగాధర్ పేర్కొన్నారు. పోతంగల్ మండలంలోని టాక్లీ, కోటగిరి మండలంలోని బస్వాపూర్ గ్రామాలలో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. సదస్సుల్లో పలువురు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అజీజ్, మధు తదితరులున్నారు.

ఎడపల్లి: రైతుల భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి రైతులను భూసమస్యల నుంచి విముక్తి కలిగించాలనే సంకల్పంతో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టి గ్రామాలలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని, అందులో భాగంగా గురువారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించడం జరిగిందని, భూ సమస్యలు ఉన్న వారు రెవెన్యూ సదస్సులో అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్‌లు అనూష, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, కుర్నాపల్లి గ్రామ రైతులు తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూసమస్యల పరిష్కారం కోసం రైతులు సదస్సుకు హాజరై దరఖాస్తులు చేసుకున్నారు. 160 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ ప్రవీణ్, తహసీల్దార్ సిబ్బంది , రైతులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని లక్కోర, వేల్పూర్ గ్రామాలలో గురువారం తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటి తహసీల్దార్ శ్రీకాంత్ ల ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులలో అయా గ్రామాల రైతులు తమ భూమిపరమైన సమస్యలపై దరఖాస్తులను అధికారులకు అందజేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ భూములకు సంబంధించిన ఎటువంటి సమస్యలున్న దరఖాస్తులు చేస్తు వాటిని పరిష్కారం చేసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, రెవెన్యూ సిబ్బంది మహేష్, శేఖర్, అలేఖ్య, శారా, శ్రీనివాస్, ప్రజ్ఞ, ఉమ, తులసినాయక్, అలేఖ్య, ఆయా గ్రామాల కార్యదర్శులు వినోద్ కుమార్, విజయ్‌కుమార్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రైతులు తామ వ్యవసాయ భూములకు సంబంధించి ఎదుర్కొంటున్న సమస్యలు ఏవైనా తగు అధారాలతో దరకాస్తులు సమర్పిస్తే సత్వరపరిష్కారం అవుతాయని కమ్మర్‌పల్లి తహసీల్దార్ ప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని బషీరాబాద్ గ్రామంలో గురువారం నిర్వహిచిన రెవవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు శ్రీరాముల మురళి, వెన్నెల దేవేందర్, మారంపల్లి ఆశన్న, రైతులు సక్కరం నర్సయ్య, అప్పయ్య తదితర రైతులు, ఆర్ ఐ శరత్ , ఏఆర్ఐ ప్రదీప్ రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

ఉమ్మడి మండలంలో పాఠశాలల పునః ప్రారంభం

కోటగిరి,జూన్12(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండలాల్లో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పునర్ ప్రారంభయ్యాయి. ఉదయం నుంచే వర్షం కురియడంతో పాఠశాలలకు విద్యార్థుల హజరుశాతం అంతంత మాత్రంగానే ఉంది. పలు పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థులకు అడ్మిషన్లు అందించారు.

నవీపేట: మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు వేసవి సెలవుల అనంతరం గురువారం పునః ప్రారంభమయ్యాయి. పాఠశాలలను మామిడి కొమ్మలతో అలంకరించారు. పలు పాఠశాలలకు చేరుకున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు పూల గుత్తులు అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు.

విలువలతో కూడిన విద్యను అందించాలి : ఎమ్మెల్యే



అంకాపూర్‌లో చిన్నారులకు అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్,జూన్12 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ పాఠశాలలో విలువలతో కూడిన విద్యను అందించి విద్యార్థుల ఉత్తీర్ణతశాతం పెంచివారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గురువారం ప్రభుత్వ ఉన్నత పాఠశా లలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటకార్యక్రమానికి ఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ ప్రభుత్వ బడులు కార్పోరేట్ పాఠశాలలకు దీటుగావిద్యబోధన అందిస్తున్నాయని అన్నారు. విద్యతో పాటు క్రీడలు,మానసిక ఉల్లాసం కేవలం ప్రభుత్వ పాఠశాలల్లోనే లభిస్తుందన్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్యేరాకేష్‌రెడ్డి చిన్నారులకు అక్షరభ్యా సం చేయించి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈకార్యక్ర మంలో ఎంపీడీవో బ్రహ్మానందం, ఎంఈవో రాజ్‌గంగారాం,ఏపీవో గంగా రాం, హెచ్ఎంలు నర్సయ్యసుభాషిణి, ఉపాధ్యాయులు, వీడీసీసభ్యులు పాల్గొన్నారు.

ఒకరికి నాలుగురోజుల జైలుశిక్ష

ఆర్మూర్‌టౌన్, జూన్12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కి చెందిన షేక్ షైమాద్‌కు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ నాలుగు రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యానారాయణ తెలిపారు. షేక్ షైమాద్ మధ్యరాత్రి సమయంలో హోటల్ నడుపుతుండడంతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగ శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ఇరిగేషన్ స్థలాలను కాపాడాలని వినతి

ఆర్మూర్ టౌన్, జూన్12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా ఏడవవార్డులో ఇరిగేషన్ స్థలాలను కాపాడాలని మున్సిపల్ కమీషనర్ రాజుకు గురువారం బీజేపీ నాయకుడు ఖాందేష్ ప్రశాంత్ వినతి పత్రం అందజేశారు. విజేత అపార్ట్‌మెంట్ పక్కన ఇరిగేషన్ స్థలంలో అక్రమంగా బోరువేసి వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ను ప్రారంభించిన వారిపై చట్టరీత్యా చర్యలు చేపట్టి ఇరిగేషన్ స్థలాలను కాపాడాలని ఆయన వినతి పత్రంలో కోరారు.



మెండోరాలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం

● మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి

మెండోర, జూన్12 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఎవరైనా ఏదైనా సాదించాలనుకుంటే అది చదువుతోనే మాత్రమే సాధ్యమవతుతుందని వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం సందర్భంగా మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఏకరూప దుస్తువులు ఏఎంసీ చైర్మన్, ఎంఈవో అందజేశారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి మాట్లాడు తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్య పైన ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. పాఠశాల తరగతి గదులు తెరుచుకోకముందే పాఠశాలకు విద్యార్థులు చదువుకునే పాఠ్యపుస్తకాలు, దుస్తువులు పాఠశాలకు చేర్చిందని ఇది విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వం సీఎం పెట్టిన ప్రత్యేక దృష్టికి నిదర్శనమన్నారు. ప్రభుత్వ పాటశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: ముప్కాల్ పాఠశాలలో గురువారం ప్రభుత్వం విద్యార్థులకు సమకూర్చిన ఏకరూప దుస్తువులను ఎంపీడీవో నరేష్‌ఆనంద్ పంపిణీ చేశారు. పాఠశాలల పునప్రారంభం రోజున విద్యార్థులకు ఏకరూప దుస్తువులు పంపిణీ చేయాలనే జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విద్యార్థులకు వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతో పాటు విద్యార్థులకు అన్ని వసుతులు కల్పిస్తున్నామని విద్యార్థుల తల్లిదండ్రులను పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం గంగారాం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎడపల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు గురువారం ఇందిరా క్రాంతి పథకం ద్వారా ఏకరూప దుస్తులను పంపిణీ చేసినట్లు ఏపిఎం గంగారాం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఏఆర్పీ క్యాంపు గ్రామంలోని హైస్కూల్, ప్రైమరీ, ఉర్దూ మీడియం పాఠశాలలతోపాటు జైతాపూర్ గ్రామంలోని ప్రైమరీ, ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రైమరీ, ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులకు మొదటి విడతగా ఏకరూప దుస్తులను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో శివ లింగాలప్ప, ఐకెపి సీసీలు భాస్కర్, రషీద్, మధు, సాయిలు, వీఓఏలు, విద్యార్థులు తదిరతులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: భీమ్‌గల్‌లోని మెండోర,బాబానగర్ గ్రామాల్లో గురువారం ప్రభుత్వ పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహిం చారు. విద్యార్థులకు ఎంపీడీవో గంగులసంతోష్‌కుమార్ ఏకరూప దుస్తువు లు, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంఈవో స్వామి, ఏపీఎం రవీందర్,సీసీలు కుంట శ్రీనివాస్, పురస్తు నరేష్, గంగ, లలిత పాల్గొన్నారు.

డొంకేశ్వర్: డొంకేశ్వర్ మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాలలో గురువారం పాఠశాలల పునప్రారంభం సందర్భంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటి కోశాధికారులు కాటిపల్లి మహిపాల్‌రెడ్డి, సుమన్, పంచాయితీ కార్యదర్శి శేఖర్, హెచ్ఎం సురేష్‌కుమార్, మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుద్రూరు: రుద్రూరు మండలంలోని రాయకూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 90మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఐవోఏ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్రంలో అన్నివర్గా ప్రజల సంక్షేమమే లక్ష్యంగా, విద్యాభివృద్ధే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని ఈ పథకాలను సద్వినియోగం చేసుకుంటు అభివృద్ధిలో సాగాలని కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ పాలెపు నర్సయ్య అన్నారు. కేజీబీవీలో విద్యార్థినిలకు ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ ఎంపీడీవో రాజా శ్రీనివాస్, ఎంఈవో ఆంధ్రయ్య , ప్రత్యేక అధికారిని గంగామణి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సుంకెట రవి, జిల్లా నాయకులు పడిగెల ప్రవీన్, తక్కురి దేవేందర్, బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, జైడి శ్రీనివాస్, రంజీత్, శివ,సిసిలు రవి, లేఖ్య, మహిళ సంఘాలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్: మండల కేంద్రంలో మాక్లూర్ ప్ర భుత్వ పాఠశాలలో విద్యార్థులకు నిజామాబాద్ మార్కెట్ కమిటి డైరెక్టర్ వెంకటేశ్వర్‌రావు చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాలలకు అన్ని వసతులు కల్పిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. ఈకార్యక్రమలో అధ్యాపక బృందంతో పాటు విద్యా ర్థులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో, తిమ్మాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండల విద్యాధికారి తమ్మిరెడ్డి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ పాఠ్యపుస్తకాలను గురువారం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపా ధ్యాయులు బాలరాజు, రమణచారి, సాగర్, నర్సింహమూర్తి, పురుషోత్తం, గంగాశంకర్, వినయసాగర్, కృష్ణ, వేణుగోపాల్,స్వరూపరాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించబడుతుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సాలూర తహసీల్దార్ శశిభూషణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అశోక్, దేవురావు, విఠల్, అంబాదాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధన్‌రాజ్, అశోక్, కస్తూరి,హన్మాండ్లు, విజయ లక్ష్మి పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలంలోని పడిగెల, మోతె గ్రామాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. పడిగెల గ్రామ ఉన్నత పాఠశాలలో స్థానిక సొసైటీ చైర్మన్ యాల్ల హన్మంత్‌రెడ్డి, మోతె పాఠశాలలో హెచ్ఎం వైద్యగణేష్ ఆధ్వర్యంలో గ్రామాభివృద్ధి కమిటి స్పీకర్లు జగదీశ్వర్‌రెడ్డి, సాయిరాంల చేతుల మీదుగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంలు రామచందర్, సరోజిని, వైద్యగణేష్, ఉపాధ్యాయులు నారాయణ, అజయ్, గోదావరి,కృష్ణవేణి, గణేష్, మహేందర్, రత్నయ్య, కవిత, శ్రావణశ్రీ, సురేష్ కుమార్,వీడీసీసభ్యులు,తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అందజేసే ఉచిత పాఠ్యపుస్తకాలను, నోటుపుస్తకాలను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి కృష్ణకుమార్ పంపిణిచేశారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు సతీష్ అమ్మఆదర్శపాఠశాల కమిటీ సభ్యులు మహిళ సంఘాల సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పలు మండలాల్లో 'అమ్మమాట.. అంగన్‌వాడీ బాట'



కోటగిరిలో అంగన్‌వాడీ బాట నిర్వహిస్తున్న దృశ్యం

కోటగిరి,జూన్12(ఆంధ్రజ్యోతి): కోటగిరి, పోతంగల్ మండలాల్లో గురువారం అమ్మమాట అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులను స్వాగతించారు. అంగన్‌వాడీ కేంద్రంలో నమోదైన చిన్నారులకు యూనిఫామ్‌లను అందిస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కొమురమ్మ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన పిల్లలకు ఎత్తు, బరువు పరిశీలించారు. అనంతరం చిన్నారులతో కలిసి బిర్యాని తిన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీ, అంగన్‌వాడీ టీచర్లు బాలలక్ష్మి, సుజాత, కల్పన, శ్రీప్రియ, సావిత్రి, జమున, కృష్ణ కుమారి పాల్గొన్నారు.

ఎడపల్లి: ఐసీడీఎస్ బోధన్ ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో మండలంలో చేపట్టిన అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని గురువారం ఎడపల్లి మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గల అంగన్ వాడీ సెంటర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణపల్లి ఇంచార్జీ అంగన్‌వాడీ టీచర్ రిబికా, వాలంటీర్ ప్రియాంక, ఏఎన్ఎం మహేశ్వరి, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

మాక్లూర్: మండలంలోని మాదాపూర్ గ్రామంలో అంగన్‌వాడి కేంద్రం వారు గురువారం అమ్మమాట అంగన్‌వాడి బాట అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా అంగన్‌వాడి కేంద్రాలను నడుపుతున్నామని తెలిపారు. ఆటపాట, ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు మధ్యాహ్న భోజనం, పాలు, గుడ్లు, పిల్లలకు స్నాక్స్ అందించడం జరుగుతుందని తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో అంగన్‌వాడి సూపర్ వైజర్ మమత, ఏఎన్ఎం కమల, ఆశవర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మున్సిపల్ పరిధి లోని మామిడిపల్లిలో గురువారం ఐడీసీఎస్ ఆధ్వర్యంలో అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఇందులో బాగంగా ర్యాలీ నిర్వహించి అంగన్‌వాడి కేంద్రాలలో అడ్మిషన్లు పెంచే లక్ష్యంతో ఇంటింటికి వెళ్లి చిన్నారులను అంగన్‌వాడిలో చేర్పించాలని కోరారు. ఈ సందర్భంగా సీడీపీవో భార్గవి మాట్లాడుతూ రెండున్నర ఏళ్లు నిండిన ప్రతీ చిన్నారులు ప్రీస్కూల్ విద్యను అభ్యసించాలని అంగన్‌వాడిలో విద్యతో పాటు పౌష్టికాహారం అందజేస్తున్నామన్నారు. అంగన్‌వాడిలో ఎల్‌కేజీ, యూకేజీ బుక్స్ , డ్రాయింగ్ వర్క్యుబుక్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. పిల్లలకు ఉదయం స్నాక్స్ మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందజేస్తున్నామని అంగన్‌వాడి కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈకార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్లు జగదాంబ, శైలజ, పద్మ లక్ష్మీ పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలో పలు అంగన్‌వాడి సెంటర్‌లో అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో భార్గవి మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రంలో ఆటపాటల ద్వారా విద్యను బోధిస్తు మధ్యాహ్న బోజనం అందిస్తున్నామని అన్నారు. ఎల్‌కేజీ, యూకేజీ పుస్తకాలు, డ్రాయింగ్, వర్క్‌బుక్స్ అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నలిని, శ్రీదేవి, అంగన్‌వాడి టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అంగన్‌వాడి కేంద్రాల్లో కూడా ప్రీస్కూల్ స్కూల్ ప్రకారం చెప్పడం ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణలత అన్నారు. గురువారం వేల్పూర్ మండలం రామన్నపేట్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాల ద్వారా అమ్మమాట అంగన్‌వాడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీవో స్వర్ణలత హాజరయ్యారు. ఈ సందర్భంగా సీడీపీవో స్వర్ణలత మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతీరోజు అందించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఉషారాణి, అంగణ్‌వాడి టీచర్లు అనిత, సుభద్ర, రజిని, ఆయలు, తల్లులు పిల్లలు పాల్గొన్నారు.

భవానీపేటలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



ప్రారంభించిన బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్‌రూరల్,జూన్12(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని భవానీపేట్ గ్రామంలో గత 11సంవత్సరాల నుండి విద్యార్థులు లేని కారణంగా మూతబడినటువంటి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో చేతుల మీదుగా పునరుద్ధరింపబడి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో మాట్లాడుతూ మూతబడిన పాఠశాలలను తిరిగి తెరిపించుట అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీవో, ప్రత్యేక అధికారి మధుకర్, పెంటాఖుర్దు కాంప్లెక్స్ ప్రధానోధ్యాయులు రత్నాకర్, శివన్నారాయణ, కిషోర్ చౌదరి, ఉపాధ్యాయులు కార్తీక్, సీఆర్‌పీ విజయ్, గ్రామ సెక్రెటరీ రాధరాణి, యువకులు భూమేష్, రాజు, శివ, స్వామి, గ్రామ పెద్దలు పోశెట్టి, గంగాధర్, అచ్యుత్ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా

భిక్కనూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామం వద్ద 44వ జాతీయరహదారిపై గోదుమల లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బుధవారం తెల్లవారుజామున బోల్తా పడింది. మధ్యప్రదేశ్ నుండి హైదారాబాద్ వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తాపడగా లారీ డ్రైవర్ స్వల్పగాయాలు అయ్యాయి. ఈ ప్రమాదంలో లారీలోని గోధుమ సంచులు రోడ్డుపై, బయటపడగా మరోలారీలో వీటిని తరలించారు. కాగా ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి ప్రమాదవశాత్తు లారీ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా కొద్దిసేపు రోడ్డుపై వాహనాలు నిలిచిపోగా జీఎంఆర్, పోలీసు సిబ్బంది ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు.

హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మరో యువకుడి మృతి

నందిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి లో చికిత్స పొందుతూ నల్లమందు సందీప్ (18) అనే యువకుడు గురు వారం మృతి చెందాడు. ఈ నెల 10న హైదరాబాద్‌లోని తార్నాకలో తా త్కాలిక నివాసం ఉంటున్న వేముల రంజిత్(19) ఆలియాస్ ద్యావల్ల సిద్దూ, నల్లమందు సందీప్ (18), శివరాం(19)లు కలిసి అల్వాల్‌లో నివాసం ఉంటున్న తన స్నేహితుడు బాను జన్మదిన వేడుకలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం తెల్లవారు జామున సుమారు 4గంటల ప్రాంతంలో సికింద్రాబాద్ హెచ్ఎండబ్ల్యూఎస్ పంప్‌హౌస్ వద్ద వారు నడుపుతున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పి మెట్రో పిల్లర్‌ను ఢీకొట్టింది.పాతూర్‌కు చెందిన వేముల రంజిత్(19) మృతి చెందాడు. అలాగే నందిపేట మండలంలోని చౌడమ్మ కొండూర్‌కు చెందిన నల్లమందు సందీప్ (18) తీవ్రగాయాలతో గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. శివరాం (19) అనే యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. సందీప్ మృతి చెందడంతో కొండూర్‌లో విషాద చాయలు అలుముకున్నాయి.

పడిగెలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పడిగెలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్న విద్యార్థులు

వేల్పూర్, జూన్12 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో 2001-02 పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తామందరం 23 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవటం ఆనందందగా ఉందని పూర్వ వి ద్యార్థులు అన్నారు. అనంతరం వారు చదువుకున్న తరగతి గదుల్లోకి వెళ్లి కూర్చొని చిన్ననాటి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను నెమరువేసుకున్నారు. ఈ సందర్భంగా చదువు చెప్పిన ఆనాటి ఉపాధ్యాయులు రంగచారి, మదన్‌మోహన్,నర్సింహులు,వెంకటనర్సయ్య, నారాయణ,గోపినాద్, శ్రీమన్నారాయణ,రవికుమార్‌ల కాళ్లు కడిగి శాలువతో సన్మా నించారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఒకరినొకరు వారి కుటుంబ వివరాలను, స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సహపంక్తి బోజనం చేశారు.

బైక్ దొంగతనం బయట పడుతుందనే హత్య

● యువకుడి హత్య కేసులో నిందితుడి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూన్12 (ఆంధ్రజ్యోతి): తాను చేసిన బైక్ దొంగతం ఎక్కడ బయట పడతాడో అని భయంతో యువకుడిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. నగరంలో పాంగ్రా పాంత్రంలో ఈ నెల 9న హత్యకు గురైన దొశి వసంత్‌కుమార్ హత్య కేసును చేధించినట్లు ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి తెలిపారు. హత్యకు గల కారణాలను ఆయన గురువారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. గాజుల్ పేట్‌లోని బురుడుగల్లీకి చెందిన సర్దార్ తేజ సింగ్ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడేవాడు. అదే క్రమంలో ఈ నెల 7న నగరంలోని గంగాస్థాన్‌ఫేజ్-2 ప్రాంతంలో ఒక ద్విచక్రవాహనాన్ని దొంగిలించాడు. దొంగిలించిన బైక్‌ను అమ్మేందుకు ఈ 9న నగరంలోని ఆర్యనగర్‌లో గల సంజీవరెడ్డి కాలనీకి చెందిన తన స్నేహితుడైన దోశి వసంత్‌కుమార్‌ను సంప్రదించాడు. తనకు డబ్బులులు అవసం ఉన్నాయని తన బైక్ పై రూ. 25 వేలు రుణం ఇప్పించాలని కోరాడు. వసంత్‌కుమార్ వాహనానికి సంబంధించిన పత్రాలు ఇస్తే రెండు మూడు రోజుల్లో రుణం ఇప్పిస్తానని చెప్పాడన్నారు. దీంతో సర్దార్ తేజసింగ్ ఆ వాహనం తన మిత్రుని పేరు మీద ఉందని ఎలాగైన రుణం ఇప్పించాలని బ్రతిమిలాడాడు. వసంత్‌కుమార్ తాను తాకట్టుపెట్టుకుని రూ.3వేలు ఇచ్చాడు. అనంతరం ఇద్దరు కలిసి పాంగ్రా ప్రాంతంలో మద్యం తాగారు. ఈ క్రమంలో వసంత్‌కుమార్ నిలదితున్ని నిలదీశారు. దీంతో తాను చేసిన దొంగతనం బయట పడతుందని సర్దార్ తేజ్‌సింగ్ పక్కనే ఉన్న బండరాయితో వసంత్ కుమార్ తలపై , ముఖంపై బలంగా బదాడు దీంతో వసంత్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు నాలుగో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో బాగంగా పాంగ్రా బోర్గాం(పి) గ్రామ శివారులో అనుమానాస్పదంగా తిరుగుతున్న సర్దార్‌తేజ్ సింగ్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా తానే హత్య చేసినట్లు ఒప్పుకునానట్లు పోలీసుల తెలిపారు. దీంతో పోలీసులు నిందితున్ని అరెస్టు చేసి అతని వద్ద నుంచి రెండు సెల్ ఫొన్లు, హత్యకు ఉపయోగించిన బండరాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు చేధనలో ప్రతిభ కనబరిచిన నేరసుడి నపట్టుకున్న నిజామాబాద్ టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్ నాల్గో టౌన్ ఎస్సైశ్రీకాంత్, సిబ్బంది, ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి అభినందిచారు.



నిందితుడితో టౌన్ సీఐ శ్రీనివాస్‌రాజ్, నాల్గోటౌన్ ఎస్సై శ్రీకాంత్

రేణుక ఎల్లమ్మ ఆలయంలో చోరీ

నవీపేట,జూన్12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లింగమయ్య గుట్ట కాలనీలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. గుర్తు తెలియని దొంగలు ఆలయ గేటుతో పాటు తలుపులకు ఉన్న తాళాలను తొలగించి లోపలికి ప్రవేశించారని అన్నారు. ఆలయం లోపల ఉన్న పంచలోహ విగ్రహంతో పాటు ఇత్తడి, రాగి వస్తువులతో తయారు చేసిన పలు వస్తువులు, మైక్ సెట్, ఆంప్లిఫయర్ తదితర వస్తువులను దొంగలు ఎత్తుకెళ్లారని ఆయన పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యుడు శేఖర్ గౌడ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహంతం చెరువులో వ్యక్తి మృతదేహం

నవీపేట,జూన్12(ఆంధ్రజ్యోతి): మండలంలోని మహంతం చెరువులో గురువారం సాయంత్రం వ్యక్తి మృతదేహం కనిపించిందని గ్రామస్థులు తెలిపారు. మృతుడికి సుమారు 25 సంవత్సరాల వయసు ఉంటుందని వారు పేర్కొన్నారు. వ్యక్తి మృతదేహం విషయంపై పోలీసులకు సమాచారం అందించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. ఈ విషయంపై ఎస్ఐ వినయ్‌ను వివరణ కోరగా మహంతం చెరువులో వ్యక్తి మృతదేహం ఉన్న విషయం తమకు సమాచారం అందిందని అన్నారు.



నిజామాబాద్ నగరంలో వర్షంలో పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న విద్యార్థులు



ఫొటో న్యూస్

బోర్గాం పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయుడు

ఉమ్మడి జిల్లాలో మోగిన బడి గంట

● సమస్యలతో విద్యార్థులకు ఇబ్బందులు

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బడిగంటలు మోగాయి. పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా ఉత్సాహంగా వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు సమస్యలతో స్వాగతం పలికాయి. వర్షం కురవడంతో చాలా పాఠశాలల ప్రాంగణాలు చిత్తడిగా మారాయి. పలు పాఠశాలల్లో ఉన్న గ్రౌండ్లు వర్షం నీటితో చెరువులను తలపించాయి. వర్షం నీరు నిండిపోవడంతో విద్యార్థులు నీళ్లలోనే నడుచుకుంటూ వెళ్లే పరిస్థితి కనిపించింది. పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా పలుచోట్ల స్కూల్ బస్సులను ఆర్టీఏ అధికారులు తనిఖీ చేశారు.

● (ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్)





స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఆర్టీఏ అధికారులు



నిలిచిన వర్షం నీటిలోనే బోర్గాం పాఠశాలకు వస్తున్న విద్యార్థులు



గౌతంనగర్ ప్రాథమిక పాఠశాలలో తొలిరోజు తక్కువ సంఖ్యలో హాజరైన విద్యార్థులు

కంఠం ఊర చెరువులో 20కిలోల చేప లభ్యం

నందిపేట, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంఠం గ్రామంలో ఊర చెరువులో 20 కిలోల బరువున్న చేప లభ్యమైంది. గ్రామానికి చెందిన గూండ్ల రాజేశ్వర్ ప్రతీరోజు లాగానే ఊర చెరువులో చేపలు పట్టడానికి గురువారం ఉదయం వెళ్లారు. వల విసరగానే అందులో 20 కిలోల బరువున్న చేప పడింది. దీంతో రాజేశ్వర్ ఆనందానికి అవదులు లేకుండా పోయాయి. చెరువులలో 20 కిలోల బరువున్న చేపలు లభ్యం కావడం ఇదే మొదటి సారని భోజన్న వ్యాఖ్యానించారు. కిలో విలువ రూ.160 నుంచి రూ.300 పలికినట్లు గ్రామస్తులు తెలిపారు.



20కిలోల చేపతో గూండ్ల రాజేశ్వర్

కన్నుల పండువగా గంగమ్మ కల్యాణం

భిక్కనూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గంగమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలను గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మ వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని విధులగుండా ఊరేగించి ఆలయ ప్రాంగణంలో అమ్మవారి కళ్యాణాన్ని వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ కన్నుల పండువగా నిర్వహించారు. ఈ మేరకు మహిళలు అమ్మవారికి ఓడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం తెప్పను తయారు చేసి డప్పుచప్పుళ్ల నడుమ స్థానిక చెరు వులో వదిలారు.



భిక్కనూరులో గంగమ్మ కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సాహితీ శిఖరం సినారె

కామారెడ్డి టౌన్, జూన్ 12(ఆంధ్రజ్యోతి): సాహితీ శిఖరం సినారె (సి.నారాయణరెడ్డి) అని తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని బీఈడీ కళాశాలలో సి.నారాయణరెడ్డి వర్థంతి సభను నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వంభర కావ్యానికి జ్ఞానపీఠ పురస్కారాన్ని అందుకుని తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చాటిన గొప్ప సాహితీవేత్త సీనారె అన్నారు. సాహిత్యంలోనే కాకుండా సినీ ప్రపంచంలో కూడా తన అక్షరాల జెండాను ఎగురవేసి గజల్ రంగంలో రారాజుగా నిలిచి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన గొప్ప సాహితీ వేత్తగా తెలంగాణ వైభవాన్ని ప్రతిభను తెలిపిన గొప్ప కవిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెరవే జిల్లా ప్రతినిధులు నర్సయ్య, లింగం, చంద్రకాంత్, రవీందర్ పాల్గొన్నారు.



సినారె చిత్రపటం వద్ద నివాళ్లు అర్పిస్తున్న తెరవే ప్రతినిధులు

గొడవలు వద్దు.. రాజీముద్దు!

● రేపు జాతీయ లోక్ అదాలత్ ● దీర్ఘకాలిక కేసుల పరిష్కారానికి అవకాశం

● సమయంతో పాటు డబ్బు ఆదా అవుతుందంటున్న న్యాయమూర్తులు ● కామారెడ్డి జిల్లాలో 7 బెంచీల ఏర్పాటు

కామారెడ్డిటౌన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న తగదాలతో మనస్పర్థలు ఏర్పరచుకుని పోలీసుస్టేషన్, కోర్టు మెట్లు ఎక్కుతూ దీర్ఘకాలికంగా మానసికంగా ఎంతోమంది ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. క్షణికావేశంలో ఒకరిపై ఒకరు ఆధిపత్యం పొందేందుకు కేసులు నమోదుచేసుకుంటూ కక్షలను పెంచుకుంటున్నారు. ఆ కేసులు ఏళ్లకొద్ది పరిష్కారం కాకుండా కోర్టుల చుట్టు తిరుగుతూ ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి చిన్నచిన్న కేసుల సత్వర పరిష్కారం లక్ష్యంగా న్యాయస్థానాలు సువర్ణవకాశం కల్పిస్తున్నాయి. రాజీమార్గమే రాజమార్గమంటూ వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితాంతం కొనసాగుతాయని, ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే సమసిపోతాయంటూ లోక్‌అదాలత్ వేదికగా కేసులను పరిష్కరించనున్నారు. దీనిలో భాగంగా జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వరప్రసాద్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి, జిల్లా జడ్జీల చేతుల మీదుగా లోక్‌అదాలత్ పోస్టర్‌లను ఆవిష్కరించారు.

లోక్ అదాలత్ అంటే..

వివాదాలను రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవడానికి ఏర్పడిన ఉప న్యాయ వేదికనే లోక్‌అదాలత్. కక్షిదారులకు సత్వరమే న్యాయం అందించడం దీని ప్రధాన ఉద్దేశం. సిట్టింగ్‌లేదా పదవీ విరమణ పొందిన న్యాయమూర్తి చైర్మన్‌గా, ఒక న్యాయవాది సభ్యులుగా లోక్ అదాలత్ సాగుతుంది. ఇక్కడ రెగ్యులర్ కోర్టుల్లో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న వాటితో పాటు ప్రీ లిటిగేషన్ కేసులను సైతం పరిష్కరిస్తారు. ఇరువర్గాలు ఓ అవగాహనకు వచ్చి రాజీకుదిరితే అక్కడికక్కడే కేసు పరిష్కారవుతుంది. ఇది పూర్తిగా చట్టబద్ధత కలిగిన అంతిమ తీర్పు కావడంతో మళ్లి అప్పిల్ చేసు కునే వీలు లేదు. న్యాయ సేవాధికారసంస్థ ద్వారా ఉచిత సేవలు అందు తాయి.

న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షణ

ఈ లోక్‌అదాలత్ కేసులకు సంబంధించి న్యాయ సేవాధికార సంస్థ రంగంలోకి దిగి పోలీసు, రెవెన్యూ తదితర శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించి దిశానిర్దేశం చేస్తారు. లోక్‌అదాలత్ మొత్తాన్ని న్యాయ సేవాధికార సంస్థ పర్యవేక్షిస్తుంది. కాగా రాజీమార్గం ద్వారా కేసులు పరిష్కరించుకుంటే ఇరువర్గాలు విజయం సాధించినట్లే అందుకే చాలాకాలం నుంచి కోర్టుల చుట్టు తిరుగుతున్న కక్షిదారులు లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడమే ఉత్తమమని న్యాయమూర్తులు సూచిస్తున్నారు. కాగా ఆయా కోర్టుల్లో లోక్‌అదాలత్ కార్యక్రమానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశారు.



లోక్ అదాలత్ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు

7 బెంచీల ఏర్పాటు

జాతీయ లోక్‌అదాలత్‌లో భాగంగా కేసు పరిష్కారానికి జిల్లాలో మొత్తం 7 బెంచిలు ఏర్పాటు చేశారు. ఇందులో కామారెడ్డిలో4 ఎల్లారెడ్డి1 , బాన్సువాడ 1, బిచ్కుందలో 1 బెంచీలు ఏర్పాటు చేసి కేసుల పరిష్కారం చేయనున్నారు. ఈ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, యాక్సిడెంట్ కేసులు, తగదా పడ్డకేసులు, చీటింగ్ కేసులకు సంబంధించిన, వివాహ బంధానికి సంబంధించిన, చిన్నచిన్న దొంగతనాలు, చెక్ బౌన్స్ తదితర కేసులను పరిష్కరించనున్నారు. దీర్ఘకాలీకంగా కేసులతో సతమతం అవుతున్న వారికి ఈ కార్యక్రమం మంచి వేదికగా ఉపయోగపడుతుందని పోలీసులు, న్యాయవాదులు పేర్కొంటున్నారు. కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచిస్తున్నారు.

స్థానికులకు మినహాయింపు ఇస్తున్నాం

● టోల్‌ప్లాజా మేనేజర్లు ● భిక్కనూరులో మండల వాహనదారులతో ప్రత్యేక సమావేశం

● వాహనదారులు తప్పకుండా ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలి

భిక్కనూరు, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద స్థానికులకు మినహాయింపు ఇస్తున్నామని కొన్ని సందర్భాలలో ఇతర్రాత సమస్యల కారణంగా డబ్బులు కట్ అవుతున్న లోకల్ వారికి తిరిగి చెల్లిస్తున్నామని టోల్‌ప్లాజా మేనేజర్లు దుర్గా ప్రసాద్, ప్రకాష్ అన్నారు. గురువారం భిక్కనూరు మండల వాహనదారులు తమ వద్ద టోల్ వసూళ్లు చేస్తున్నారని ఎన్నిసార్లు విన్నవించిన సమస్య పరి ష్కారం కావడం లేదని ఆరోపిస్తూ ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో టోల్‌ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చారు. దీంతో టోల్‌ప్లాజా వద్ద ట్రాఫిక్ సమస్య తలెత్తు తుందని, లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్ ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులతో మాట్లాడి భిక్కనూరు మార్కెట్ కమిటీ ఆవరణలో వాహనదారులు, ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయించి టోల్‌ప్లాజా మేనేజర్లను అక్కడికి పిలిపించారు. ఈ సందర్భంగా టోల్‌ప్లాజా మేనేజర్లు మాట్లాడుతూ టోల్‌ప్లాజా వద్ద ప్రతిరోజు చాలా లోకల్ వాహనాలు వెళ్తున్నాయని, ఎవరికి టోల్ వసూళ్లు చేయడంలేదన్నారు. కొన్నిసార్లు సాంకేతిక సమస్యతో డబ్బులు కట్ అవుతున్న వారికి తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు. స్థానికులు వాహనదారులు మాత్రం తప్పకుండా సైడ్ ఎగ్జిట్ ద్వారా తమ సిబ్బంది అడిగిన సరైనా పత్రాలను చూపించి వెళ్లోచ్చన్నారు. ఇకముందు సైడ్ ఎగ్జిట్‌లలో లోకల్ సిబ్బందిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని, లోకల్ వాహన దారులు ఆర్సీ, ఆధార్‌కార్డులతో టోల్‌ప్లాజా వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ టోల్‌ప్లాజా వద్ద గతంలో నడిచిన విధంగానే లోకల్ వాహనాలకు మినహాయింపు ఇవ్వాలని, ఇక నుంచి ప్రతీరోజు ఇద్దరు సిబ్బందితో రక్షణ కల్పిస్తామన్నారు. దీంతో ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఆందోళనను విరమించుకున్నారు. కాగా ఐక్యకార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో టోల్ ము ట్టడి పిలుపు మేరకు టోల్‌ప్లాజా వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహారించారు. ఈ కార్యక్రమంలో ఐక్య కార్యాచరణ కమిటీ ప్రతినిధులు, వాహనదారులు పె ద్దఎత్తున పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భిక్కనూరు సీఐ

ప్రతీఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

● డీఎంవో డాక్టర్ తుకారం

ఆర్మూర్ టౌన్, జూన్12 (ఆంధ్ర జ్యోతి): వర్షకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని డీఎంవో డాక్టర్ తుకారం అన్నారు. గురువారం పట్టణం లోని యూపీఎస్‌సీ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడు తూ ప్రస్తుత వర్షకాలంలో మలేరియా, డెంగ్యూ వ్యాధులు పెరిగే అవకాశం ఉన్నందున గ్రామ పంచాయితీ మున్సి పాలిటిలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని దోమ కాటువల్ల ఎనిమిద రకాల వ్యాధుల భారిన పడే అవకాశం ఉందని ప్రతీ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. ఏఎన్ఎం ఆశ వర్కర్ల సహకారంతో ముందస్తు చర్యలతో పాటు ఆయిల్ బాల్, బ్లీచింగ్‌పౌడర్ చల్లి ఇంటి చుట్టు ప్రాంతాల్లో పరిశుభ్రత పాటించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్, మెడికల్ ఆఫీసర్‌లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్‌లో అవగాహన కల్పిస్తున్న డీఎంవో డాక్టర్ తుకారం

సీజనల్ వ్యాధులపై అవగాహన

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ప్రస్తుత వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాదులు వాటి నివారణపై డీఎంవో డాక్టర్ తుకారాం అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాదులు సంభవించకుండా నీటి నిల్వలు తొలగించాలని తద్వారా దోమలు నిల్వ ఉండకుండా చూడాలని వాడ్ ఆఫీసర్లకు, జవాన్లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్, మెడికల్ ఆఫీసర్ పాతిమా, కీర్తన, సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, వైద్య సిబ్బంది ఆనంద్ పాల్గొన్నారు.

కాలభైరవ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

● పాల్గొన్న రాష్ట్ర పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజనీర్ కనకరత్నం దంపతులు

రామారెడ్డి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రం - ఇసన్నపల్లి గ్రామాల మధ్య దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాలభైరవ స్వామి ఆలయంలో రాష్ట్ర పంచాయతీ రాజ్ చీఫ్ ఇంజనీర్ దేవ దాయ శాఖ చీఫ్ ఇంజనీర్ కనకరత్నం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ నుం చి నిజామాబాద్ జిల్లా కేంద్రానికి వెళ్తుండగా మార్గమధ్యంలో శ్రీ కాలభైరవ స్వామి ఆలయానికి చేరుకొని ఆలయ గర్భ గుడిలో ప్రత్యేక పూజలు, సింధూర పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ విశిష్టత, అభివృద్ధి గురించి ఆలయ జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్ వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ ఇంజనీర్ కనకరత్నం మాట్లాడుతూ ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో అదృష్టమని మొక్కిన కోర్కెలు తీరితే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో బుర్ర ప్రభురాం చంద్రం గుప్తా, కామారెడ్డి డివిజన్ పంచాయతీ ఇంజనీర్ బాల్‌లింగం, ఏఈ సురేష్, సిబ్బంది నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కనక రత్నం దంపతులను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న బ్యాంక్ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్

'ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం'

డిచ్‌పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు బ్యాంక్ ఆఫ్ ఇండియా నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ జనరల్ మేనేజర్ మనోజ్‌కుమార్ శ్రీవాస్తవ్ అన్నారు. గురువారం మండలంలోని బర్ధిపూర్ శివారులోగల కృష్ణ స్టార్ హోటల్‌లో ఖాతాదారుల అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. బీవోఐ ద్వారా అందిస్తున్న వివిధ రకాల రుణాలు, డిపాజిట్‌లపై ఆయన ఖాతాదారులకు వివరించారు. 119 సంవత్సరాల చరిత్రగల బ్యాంకు స్వాతంత్ర్యానికి ముందు నుంచి ఇప్పటి వరకు మెరుగైన సేవలు అందిస్తుందన్నారు. నిజామాబాద్, ఆర్మూర్, కామారెడ్డి, నిర్మల్ ప్రాంతాల పరిధిలో నూతన ఖాతాదారుల పెంపు కోసం చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. వ్యవసాయ రుణాలు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. జోనల్ మేనేజర్ తెలంగాణ జోన్ ముఖేష్ కుమార్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో మొదటి సారిగా ఈ సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. బీవోఐ ద్వారా 2లక్షల నుంచి వ్యక్తిగత రుణాలతో పాటు 20లక్షల గ్రూప్ రుణాలు అందజేస్తామన్నారు. మెప్మా జిల్లా కోఆర్డినేటర్ మాధురి మాట్లాడుతూ ఖాతాదారుల ద్వారానే బ్యాంకుల మనుగడ సాధ్యం అని అన్నారు. పట్టణ ప్రాంత మహిళా సంఘాలకు స్వయం సహాయక రుణాలు అందించడంలో బ్యాంకులు ముందుకు రావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ జితేంద్రకుమార్ శ్రీవాస్తవ్, నిజామాబాద్ బ్రాంచ్ సీనియర్ మేనేజర్ వంశీనాథ్‌గౌడ్, పలువురు మేనేజర్లు, సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సుకు హాజరైన సిబ్బంది, ఖాతాదారులు

మంత్రి వివేక్‌ను కలిసిన మాలమహానాడు నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాలమహానాడు నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నూతనంగా మంత్రి బాధ్యతలు చేపట్టిన వివేక్‌ను జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు దేవిదాస్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివేక్‌కు గనులు, కార్మిక, ఉపాధి శిక్షణ శాఖలను కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో ఉమ్మడి జిల్లాల టీమ్ కన్వీనర్ అలుక కిషన్, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్లయ్య, కార్యదర్శి నంది వినయ్‌కుమార్, జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, ఈసీ మెంబర్ సతీష్‌లు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టిసారించాలి

● వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్వేత

ధర్పల్లి, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టిసారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.శ్వేత రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని రామడుగు గ్రామంలో వికసిత కృషి సంకల్ప్ అభియాన్ మరియు రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమానికి రైతులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కృషి విజ్ఞాన కేంద్రం రుద్రూర్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ అనుబంధంతో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు తక్కువ యూరియా వాడి సాగు ఖర్చు తగ్గించడం అవసరం మేర రసాయన ఎరువులను వినియోగించి నేల ఆరోగ్యం కాపాడాలన్నారు. రసీదులను భద్రపర్చుకొని కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందడం, సాగునీటిని ఆదాయం చేయడం, పంట మార్పు, సుస్థిర ఆదాయాన్ని పొందడం వంటి అంశాలపై రైతులకు వివరించారు. రైతులకు విశ్వవిద్యాలయం ద్వారా అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయ సాంకేతిక సమాచార సాధనాలైన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం యూట్యూబ్‌ఛానల్, వ్యవసాయ మాసపత్రిక మరియు కిసాన్ సారథి ద్వారా రైతులకు అందిస్తున్న సమాచార సేవల గురించి రైతులకు వివరించారు. కెవికె ద్వారా రైతులకు వాతావరణ ఆధారిత వ్యవసాయ సలహాలు మరియు రెయిన్ అల్లారం ఆఫ్ గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సస్యరక్షణ శాస్త్రవేత్త విజయ్‌కుమార్ మాట్లాడుతూ రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. తక్కువ కాలపరిధి గల రకాలను ఎంచుకోవడం తద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చన్నారు. పంట మార్పు తప్పనిసరి అని ఒకే రకమైన పంటలు వేయడం వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. పప్పు ధాన్యాలు, నూనె గింజలు వేసుకోవడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని రైతులకు సూచించారు. వరి, పసుపు, మొక్కజొన్న పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశ్, ఈఏవో మనోజ్, రైతులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో 7 ఏళ్ల జైలు

నిజామాబాద్ లీగల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో సంతోష్‌రెడ్డి అనే వ్యక్తి దొంగతనం చేసినందుకు 7 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ మొదటి అదనపు జిల్లా జడ్జి కనకదుర్గ గురువారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. రేంజల్ గ్రామానికి చెందిన అల్లూరి సంతోష్‌రెడ్డి పలు దొంగతనాల కేసులు నమోదు అయ్యాయి. 1-1-2024న ధర్పల్లి మండలానికి చెందిన దుబ్బాక గ్రామంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో దొంగతనానికి పాల్పడేందుకు లాకర్‌ను ధ్వంసం చేయగా బ్యాంకు మేనేజర్ ఫోన్‌కు సంకేతం రావడంతో పోలీసులను అప్రమత్తం చేశారు. హుటా హుటీన పోలీసులు బ్యాంకుకు చేరుకొని నిందితుడిని పట్టుకొని ఐపీసీ 380, 457, 511 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చగా కోర్టులో పోలీసు వారి తరఫున డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య వాదించగా వాదనలు విన్న జడ్జి ముద్దాయికి 7 సంవత్సరాల జైలు శిక్ష మరియు అదనంగా 3వేల రూపాయల జరిమానా, జరిమానా చెల్లించని యెడల మరో 6 నెలల జైలు శిక్ష విధించాలని తీర్పు చెప్పారు.

'హామీలను నిలబెట్టుకోవాలి'

సిరికొండ, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ అన్నారు. ఏఐపీకెఎంఎస్ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు సిరికొండలో వ్యవసాయ కూలీలతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ రవీందర్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాస్‌లైన్ డివిజన్ నాయకులు దామోదర్, మండల జిల్లా సహాయ కార్యదర్శి సాయరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, దుస్తుల పంపిణీ

మోపాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు గురువారం పునఃప్రారంభం కావడంతో ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు దుస్తుల పంపిణీ చేశారు. మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, ఇటు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం దేవిక, భారతి, జ్యోత్స్న, ప్రేమ్‌లాల్, పుష్ప, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మహిళా సంఘ సభ్యులు కుట్టిన 74 యూనిఫామ్‌లను మండల ప్రత్యేక అధికారి యోహాన్, ఎంపీడీవో లింగం నాయక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం రజితరెడ్డి, చైల్డ్ కేర్ టేకర్ చైతన్య, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడి, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇందల్వాయి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని తహసీల్దార్ వెంకట్రావ్ అన్నారు. మండలంలోని గన్నారం, నల్లవెల్లి, చంద్రయాన్‌పల్లి, ఎల్లారెడ్డిపల్లి, తదితర గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలను గురువారం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో అనంత్‌రావు, ఎంఈవో శ్రీధర్, ప్రధానోపాధ్యాయురాలు మాధురి, ఐకేపీ ఏపీఎం సువర్ణ, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నవీన్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, వీవోఏలు రత్న, లాస్య, సంధ్య, లావణ్య, మహిళా సంఘం నాయకురాలు గంగాభూదేవి, పుష్ప, పీఆర్‌టీయూ అధ్యక్షులు భార్గవ్, సెక్రెటరీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.



ధర్మారం(బి)లో దుస్తులు, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న దృశ్యం

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

● కమిషనర్‌కు వినతిపత్రం అందజేసిన వామపక్ష నాయకులు

సుభాష్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ, సీఐటీయూ, ఏఐటీయూసీ సంఘాల బాధ్యులు నగర పాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో గురువారం కమిషనర్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల పారిశుధ్య కార్యక్రమం పేరుతో నగర పాలక సంస్థలో పనిచేస్తున్న కార్మికులతో ఆదివారం, పండుగ సెలవులు ఇవ్వకుండా పనిచేయిస్తున్నారని అన్నారు. ఒకవైపు వర్షాలు కురుస్తుండటం తగిన పనిముట్లు, భద్రత పరికరాలు లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్న కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. కార్మికులకు పనిముట్లు, రైన్‌కోట్‌లు, చేతిగ్లౌజులు, బూట్లు ఇవ్వలేదన్నారు. పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు అన్ని రకాల పనిముట్లు, భద్రత పరికరాలు ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ ఐడీకార్డులు ఇవ్వాలన్నారు. డిమాండ్‌కు సరిపడా కార్మికుల సంఖ్య లేకపోవడంతో కార్మికులపై అధికభారం పడుతుందన్నారు. వెంటనే ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో స్పందించిన కమిషనర్ ఆదివారం, పండుగ సెలవులను అమలు చేస్తామని, ఐడీకార్డులు, పనిముట్లు కార్మికులందరికీ త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓమయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న వామపక్ష నాయకులు

సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలి

● డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

మోపాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో ఎటువంటి సీజనల్ వ్యాధులు రాకుండా ఉండాలంటే గ్రామస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, మలేరియా అధికారి తుకారాం రాథోడ్ అన్నారు. గురువారం మోపాల్ మండల పరిషత్ కార్యాలయంలో గ్రామస్థాయి కార్యదర్శులు, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశావర్కర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తుకారాం రాథోడ్ మాట్లాడుతూ.. వర్షాలు బాగా కురుస్తున్నాయని గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లమీద నీటి నిలువ లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు వైద్య ఆరోగ్య సిబ్బందితో పాటు ఆశావర్కర్లు గ్రామాల్లో తిరుగుతూ ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. వర్షాకాలంలో ఎక్కువగా డెంగ్యూ, కలరతో పాటు ఇతర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అన్నారు. నీటి నిల్వలు ఎక్కువగా ఉండటంతో దోమలు ఎక్కువగా వస్తాయని వాటితో జ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాములు నాయక్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్

నేషనల్ సర్జన్స్‌డే సందర్భంగా రక్తదానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జూన్ 15న నేషనల్ సర్జన్స్ డే సందర్భంగా సర్జన్స్ వారోత్సవాల్లో భాగంగా ద అసోసియేషన్ ఆఫ్ సర్జన్స్ ఆఫ్ ఇండియా, ఐఎంఏ సంయుక్తంగా గురువారం నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రమాదాలు, రక్తస్రావాలు, గర్భిణులకు ఆపరేషన్ చేసినపుడు సరైన గ్రూప్ రక్తం దొరకక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని వారికి ఉపయోగకరంగా ఉండేందుకు రక్తదాన శిబిరాన్ని నిర్వహించినట్లు రాష్ట్ర సర్జన్స్ సంఘం అధ్యక్షుడు జీవన్‌రావు, ఏఎస్సై జిల్లా అధ్యక్షుడు నరేంద్రలు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రాజేష్, ఐఆర్‌సీఎస్ మెడికల్ ఆఫీసర్ రాజేష్, డివిజన్ చైర్మన్ డాక్టర్ శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులకు దరఖాస్తుల వెల్లువ

(ఐదో పేజీ తరువాయి)

1090 మంది దరఖాస్తులు చేయగా తమ భూములను వర్గీకరించాలని 324 మంది ఫిర్యాదు చేశారు. పట్టాకు సంబంధించిన వివరాలు ఇవ్వాలని 466 మంది రైతులు ఈ రెవెన్యూ సదస్సులో అధికారులకు దరఖాస్తులను అందించారు. భూములకు సంబంధించి నిషేదిత జాబితాలో ఉన్న వాటి కోసం 293 మంది రైతులు దరఖాస్తులను చేశారు. తమ భూములను నిషేధిత జాబితా నుంచి ఎత్తివేయాలని కోరారు. అసైన్డ్ భూముల సమస్యలను పరిష్కరించాలని 607 మంది ఓఆర్‌సి ఇష్యూ చేయాలని 34 మంది, 38ఈ సర్టిఫికెట్ ఇవ్వడం లేదని ఒకరు ఫిర్యాదు చేశారు. భూమికి సంబంధించి సక్సేషన్ సర్టిఫికెట్ ఇవ్వాలని 1587 మంది, ల్యాండ్ అక్విజేషన్ కోసం 12 మంది, ఇతర భూ సమస్యల కోసం 8857 మంది దరఖాస్తులను చేశారు. ఇవే కాకుండా సాదాబైనామాల సమస్యను పరిష్కరించాలని 3894 మంది రైతులు ఫిర్యాదులు చేశారు. ఏళ్ల తరబడి వీటిని పరిష్కరించలేదని అధికారులకు వివరించారు. ధరణి సమయంలో కూడా వీటిని పరిష్కరించేందుకు నిర్ణయం తీసుకోలేదని కోరారు. పీవోటి కింద భూముల సమస్యలను పరిష్కరించాలని 3857 మంది రైతులు దరఖాస్తులను చేశారు. భూముల సర్వే చేపట్టాలని 344 మంది, ఇతర భూ సమస్యల కోసం 760 మంది దరఖాస్తులు ఇచ్చారు. ఈనెల 20 వరకు రెవెన్యూ సదస్సులు కొనసాగనున్నాయి. అన్ని గ్రామాల్లో పూర్తయిన తర్వాత వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు గ్రామాల్లో పర్యటిస్తారు. భూములకు సంబంధించిన సర్వేలను నిర్వహిస్తారు. ఆగస్టు 14లోపు జిల్లాలో రెవెన్యూ సదస్సుల ద్వారా భూ సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో రెవెన్యూ సదస్సుల్లో భారీగా దరఖాస్తులు వస్తున్నాయని వాటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని నిజామాబాద్ ఆర్‌డీవో రాజేంద్రకుమార్ తెలిపారు.

నగరంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

సుభాష్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ధర్మపురి హిల్స్‌లో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలను కూల్చివేశారు. నగరంలోని ధర్మపురి హిల్స్, పేంటర్స్ కాలనీలోని సర్వే నెంబర్ 249, 250, 251లో ప్రభుత్వ భూముల్లో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను జేసీబీ సహాయంతో గురువారం కూల్చివేశారు. ఉదయం నిజామాబాద్ ఉత్తర మండల తహశీల్దార్ భూలోకం విజయ్‌కాంత్‌రావు స్థానిక ఎస్సై వెంకట్రావుల ఆధ్వర్యంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గత కొంత కాలంగా అక్రమ నిర్మాణాలపై పలు ఫిర్యాదులు రావడంతో ఉదయం నుంచి పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూలోకం విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, పోలీసులు ఉన్నారు.

ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాలకు అవకాశం

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2025-26 విద్యాసంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశానికి షెడ్యూల్ విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్, పీహెచ్‌సీ మరియు మహిళలకు ప్రవేశ రుసుములో ప్రభుత్వం నుంచి రాయితీ ఇవ్వడం జరుగుతుందని జిల్లాలోని ఆసక్తిగల అభ్యర్థులు ఓపెన్‌స్కూల్ స్టడీ సెంటర్‌లో ప్రవేశం పొందవచ్చన్నారు. సాధారణ రుసుముతో ప్రవేశ ఫీజు చెల్లించేందుకు ఈనెల 12 నుంచి జూలై 11 వరకు అవకాశం ఉందని 10వ తరగతికి రూ.1550, ఇంటర్మీడియెట్‌కు రూ.1800లు చెల్లించాలని అపరాధ రుసుము 10వ తరగతికి రూ.100, ఇంటర్మీడియెట్‌కు రూ.200లతో ఆగస్టు 12 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. వివరాలకు ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ రవీందర్ 9908896096, 9849234696 నెంబర్‌లను సంప్రదించాలన్నారు.

వ్యాయామ విద్యను మూల్యాంకన సబ్జెక్టుగా చేయాలి

సుభాష్‌నగర్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): వ్యాయామ విద్యను మూల్యాంకన సబ్జెక్టుగా తప్పనిసరిగా చేయాలని స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కెప్టెన్ డాక్టర్ ఎల్.పాండురంగారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ తెలంగాణ ఆధ్వర్యంలో వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు విద్యాసాగర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన రాంభూపాల్

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన రాంభూపాల్, క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నియమితులైన రామకృష్ణలు గురువారం హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. తమను టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా, క్రమశిక్షణ కమిటీ సభ్యుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తమవంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా ఇరువురు నేతలు హామీ ఇచ్చారు. వారితో పాటు జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డి రాజరెడ్డి, నాయకులు జగడం సుమన్, పుప్పాల రవి, నాగరాజు, ధాత్రిక భాస్కర్, తదితరులు పీసీసీ అధ్యక్షుడిని కలిసిన వారిలో ఉన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ (డైట్) కళాశాల నిజామాబాద్‌లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసేందుకు అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ తెలిపారు. 65 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన రిటైర్డ్, నిరుద్యోగ అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.23,400లు, కరిక్యులర్ అభ్యర్థులకు రూ.15,600లు, కోకరిక్యులర్ అభ్యర్థులకు గౌరవ వేతనం ఇవ్వబడుతుందన్నారు. ఇంగ్లీష్, తెలుగు మీడియం కలిపి మొత్తం 9 పోస్టులు ఉన్నాయని ఫిలాసఫీ లేదా సోషియాలజీ-1, సైకాలజీ-1, సైన్స్ పెడగాజీ-1, గణితం పెడగాజీ-2, సోషల్ సైన్స్ పెడగాజీ-1, తెలుగు లాంగ్వేజ్ పెడగాజీ-1, ఆరోగ్య వ్యాయామ విద్య-1, ఫైన్ ఆర్ట్స్-1 మరియు ఉర్దూ మీడియంలో 5 పోస్టులు ఫిలాసఫీ లేదా సోషియాలజీ లేదా సైకాలజీ-1, సైన్స్ పెడగాజీ-1, గణితం పెడగాజీ-1, సోషల్ సైన్స్ పెడగాజీ-1, ఉర్దూ లాంగ్వేజ్ పెడగాజీ-1 ఖాళీలు ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులలో పోస్టు గ్రాడ్యుయేషన్, ఎంఈడీ అర్హత కలిగి ఉండాలని ఎంఈడీ అభ్యర్థులు అందుబాటులో లేకున్నట్లయితే సంబంధిత సబ్జెక్టుకు బీఈడీ అభ్యర్థులను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున ఆసక్తిగల అభ్యర్థులు కళాశాలలో అందుబాటులో ఉన్న అప్లికేషన్ ఫారాలను పూర్తిచేసి సంబంధిత జిరాక్స్ కాపీలతో ఈనెల 13 నుంచి 19 వరకు సమర్పించవచ్చని తెలిపారు. 21న అర్హుల తుదిజాబితా, 24 నుంచి 26 వరకు మెరిట్ ప్రతిపాదికన డెమో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

సాయుధ దళాల పతాక నిధికి విద్యుత్ శాఖ మాజీ ఉద్యోగి లక్ష విరాళం

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ కోసం తమ జీవితాలను త్యాగం చేస్తూ తమ భార్య పిల్లలను ఇంటి దగ్గరే వదిలే ఎక్కడో దేశ సరిహద్దులో దేశ రక్షణ కోసం భారత ప్రజల సుఖశాంతుల కోసం పనిచేస్తున్న భారత త్రివిధ దళాల సేవలు మరువలేనివని అందుకే వారి సంక్షేమానికి దేశ పౌరుడిగా చేయూతనిస్తూ రూ.లక్ష చెక్కును విద్యుత్ శాఖ రిటైర్డ్ ఉద్యోగి కె.కృష్ణ మూర్తి శర్మ గురువారం ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రమేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుంచి వ్యాపారస్తులు, ప్రజలు దేశరక్షణలో విధులు నిర్వహిస్తున్న సైనికులకు, వారి కుటుంబాలకు స్వచ్ఛందంగా విరాళాలు అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు : జేడీఏ

మోపాల్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఏ సొసైటీల్లో యూరియా కొరత లేదని జేడీఏ వీరస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొసైటీలో ఎంత యూరియా ఉన్నది రైతులకు ఎంత పంపిణీ చేసిన విషయంపై ఆరా తీశారు. ఎక్కువ శాతంగా యూరియా వాడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

పుస్తకావిష్కరణను జయప్రదం చేయాలి

నిజామాబాద్ అర్బన్, జూన్ 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14న హైదరాబాద్‌లోని సురవరం ప్రతాప్‌రెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో నిర్వహించనున్న ది ఓబీసీ అప్రైజింగ్ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నగర పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పెంట దత్తాద్రి కోరారు. ప్రముఖ ఐఏఎస్ అధికారి, మధ్యప్రదేశ్ ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి, హైకోర్టు న్యాయవాది పృథ్వీరాజ్‌సింగ్ సంయుక్తంగా రచించిన ఈ పుస్తకంలో ఆరేళ్లపాటు సాగిన లోతైన పరిశోధన ఆరు రాష్ట్రాల్లో జరిపిన విస్తృత అధ్యయనం ఉన్నాయన్నారు. దేశంలో వెనుకబడిన బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లు, వాటి పరిష్కార మార్గాలను ఈ పుస్తకంలో విపులంగా పొందుపర్చారని దత్తాద్రి అన్నారు. 9 విభాగాలుగా పుస్తకం రూపొందించడం జరిగిందని కావున ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమానికి విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, రాజకీయ నాయకులు, న్యాయనిపుణులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పద్మశాలీ సంఘం కార్యదర్శి భూమేశ్వర్, కోశాధికారి సాయిలు, నాయకులు ఎనుగందుల మురళి, దుబ్బ రాజం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.115	రూ.200	రూ. 230
వెన్‌కాబ్(కిలో)	: రూ.120	రూ.210	రూ. 240



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.97,900	రూ.90,400	రూ.1060

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (తెలుగు 3డి) (11.00, 1.45, 4.30)
: హౌటూ ట్రేయిన్ యువర్ డ్రాగెన్ (ఇంగ్లీష్ 3డి) (7.15, 10.00)
స్క్రీన్-2 : హౌజ్‌ఫుల్-5 (హిందీ) (10.10, 4.25)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (1.40)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (ఇంగ్లీష్) (7.55, 10.40)
స్క్రీన్-3 : ది హంటర్ (తెలుగు) (11.10)
: ఫైనల్ డిస్టనేషన్ బ్లడ్ లైన్స్ (తెలుగు) (1.50)
: ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (4.20)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (7.05, 10.35)
స్క్రీన్-4 : ఫ్రమ్ ది వరల్డ్ ఆఫ్ జాన్‌వీక్ (తెలుగు) (11.30) : కట్టప్ప జడ్జిమెంట్ (2.15)
: పాప (4.50) : అందాల రాక్షసి (7.35, 10.45)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : అందాల రాక్షసి (10.20)
స్క్రీన్-2 : అందాల రాక్షసి (11.00, 4.30)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (1.35, 7.30, 10.30)
స్క్రీన్-3 : శ్రీశ్రీశ్రీ రాజావారు (10.45, 4.40, 10.30)
: హౌజ్‌ఫుల్-5 (హిందీ) (1.30, 7.30)

దేవి : శ్రీశ్రీశ్రీ రాజావారు (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : హౌజ్‌ఫుల్-5 (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్